క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆప్తాలమిక్ ఆఫీసర్ మోహన్, డాక్టర్ పద్మ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 115 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. 11 మందికి కంటి సమస్యలు గుర్తించి మందులు పంపిణీ చేశారు. వీరికి త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య పాల్గొన్నారు.

తునికిపల్లె దవాఖాన తనిఖీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికీ పల్లె దవాఖానను మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ చికిత్సలు, మందులు పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



రావిచెట్టుకు పూజలు చేస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని సరస్వతీ శిశుమందిరంలో ప్రకృతి వందన్‌లో భాగంగా పురాతన రావిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, హెచ్‌ఎం వీరప్ప, జిల్లా పర్యావరణ ప్రముఖ్ రవివర్మ, మాజీ ఎంపీటీసీ సుభాష్‌గౌడ్, ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు తదితరులున్నారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి



నిల్వ నీటిని పారబోయిస్తున్న కార్యదర్శి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామస్తులు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని పంచాయతీ క్యాదర్శి అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని గంగారం గ్రామంలో డ్రైడే నిర్వహించారు.

తునికిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వైద్యసిబ్బంది డ్రైడే నిర్వహించారు. కౌడిపల్లి, తునికి తదితర గ్రామాల్లో మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశీలించారు.

వైభవంగా మహంకాళి జాతర



కలశాల ఊరేగింపులో మహిళలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో మహంకాళి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది మహిళలు హనుమాన్ దేవాయలం నుంచి కలశాలతో ఊరేగించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి 108 కలశాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సన్మానం

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని ఎస్టీయు కార్యాలయంలో ఇటీవల స్కూల్ అసిస్టెంట్ లుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను శుక్రవారం ఎస్టీయూ టీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ సన్మానించారు. ఎస్టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్, రాధాకృష్ణ ఉన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఎంఈఓ బుచ్చనాయక్ సన్మానించారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న మహేందర్‌రెడ్డిని ఎస్‌ఐ నారాయణగౌడ్ సన్మానించారు.

రుణమాఫీ సర్వే ముమ్మరం



నర్సాపూర్‌లో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏడీఏ సంధ్యరాణి, ఏఓ

నర్సాపూర్: రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబాల వివరాలు సేకరిస్తున్నామని వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యరాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి రైతుల వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా శుక్రవారం పట్టణంలో మండల వ్యవసాయాధికారి దీపిక, ఏఈఓ చంద్రవేణిలు సర్వే చేశారని అన్నారు. రుణమాఫీ 2024 సంబంధించి రైతుల కుటుంబ నిర్ధారణ చేయాల్సిన రైతుల వివరాలు సేకరిస్తున్నామని వివరించారు. కాగా రైతువేదికలో వివరాలు స్వీకరించడంతో పాటు రైతుల ఇళ్లకు వెళ్లి సైతం వివరాలు సేకరించినట్లు ఏడీఏ వివరించారు.

కుటుంబ సభ్యుల వివరాలు అందించండి: కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): రేషన్‌కార్డులేని రైతుల రుణమాఫీకి ఇంటింటి సర్వే చేస్తున్నట్లు ఏఓ స్వప్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రావ్‌పేట, ముట్రాజ్‌పల్లి, తిమ్మాపూర్ గ్రామాల్లో రైతు రుణమాఫీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ. 2లక్షల లోపు వ్యవసాయ రుణాలు మాఫీ చేసిందన్నారు. రేషన్‌కార్డులేని అర్హులైన రైతుల రుణమాఫీ కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా మండలంలోని వివిధ గ్రామాలలో 433 మంది రేషన్‌కార్డు లేని రైతులు ఉన్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు ఆధార్‌కార్డు ఆధారంగా సర్వే చేసి, ప్రభుత్వానికి వివరాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 165 మంది రైతులను సర్వే చేసినట్లు చెప్పారు. మిగతా రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సౌజన్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వివరాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ కొనసాగుతోంది. శుక్రవారం ఇన్‌చార్జి ఏఓ నాగం కృష్ణ, ఏఈఓ వినీత్ దరఖాస్తు చేసుకున్న రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక యాప్‌లో కుటుంబ సభ్యుల వివరాలను అప్‌లోడ్ చేశారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మమత, అఖిల్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.



కౌడిపల్లి(నర్సాపూర్): వెంకట్రావ్‌పేటలో ..



పెద్దశంకరంపేటలో..

సర్వే పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): రుణమాఫీకి అర్హులై ఉండి, రేషన్ కార్డులు లేని రైతులు తమ కుటుంబసభ్యుల ఆధార్ కార్డులు, తదితర వివరాలు వ్యవసాయాధికారులకు అందజేయాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో నిర్వహించిన రుణమాఫీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయంలో అర్హులైన రైతుల వివరాలు సేకరించి, ఆప్‌లో పొందుపరిచామన్నారు. రుణమాఫీ కాని అర్హులైన రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, తప్పనిసరిగా వారికి రుణమాఫీ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఏఈఓలు భూపాల్, రమ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దొంతిలో..

శివ్వంపేట(నర్సాపూర్): రేషన్‌కార్డులు లేకున్న రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ వర్తింస్తుందని ఏఓ లావణ్య అన్నారు. మండల పరిధిలోని దొంతిలో పర్యటించారు. రుణమాఫీకి సంబంధించి పలు రైతుల కుటుంబ నిర్ధారణ వివరాలు సేకరించారు.

మంచి పౌరులుగా తీర్చిదిద్దాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉండే విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి వసతిగృహ సంక్షేమ అధికారులకు సూచించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వసతిగృహాల సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై, మాట్లాడుతూ... ప్రభుత్వ వసతిగృహాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. వసతిగృహాల్లో ఏమైన సమస్యలుంటే మా దృష్టికి తెస్తే వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని చెప్పారు. తాను ఆకస్మికంగా హాస్టళ్లను తనిఖీ చేస్తానని, అందరు తమ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆయా శాఖల సంక్షేమ అధికారులు నాగరాజుగౌడ్, లింగేశ్వర్, ఎంపీడీఓలు శ్రీనివాస్, ఉమాదేవి, మాజీ జెడ్పీటీసీ బబియానాయక్, ఆయా ప్రభుత్వ వసతిగృహ సంక్షేమ అధికారులు రాజుకుమార్, బాన్‌సింగ్, శ్రీనివాస్, యాదయ్య, సుమన్, గాయత్రి, ఉమా, యాదమ్మ, నర్సమ్మ, మాణిక్యం, నవీన్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం: ఎమ్మెల్యే

శివ్వంపేట(నర్సాపూర్): మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం శివ్వంపేటలోని రైతు వేదికలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్న మాటల్లో నిజం లేదన్నారు. రైతుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేంత వరకు బీఆర్ఎస్ ప్రణాళిక సిద్ధం చేస్తుందని, త్వరలోనే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసం గురించి వివరిస్తామన్నారు. గత ప్రభుత్వం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ నిధులు కూడా సకాలంలో మంజూరు కావడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు హరికృష్ణ, మహేష్‌గుప్తా, చంద్రగౌడ్, మన్సూర్, యాదగౌడ్, నాగేశ్వర్‌రావు, మైసయ్యయాదవ్, చింత స్వామి, మహిపాల్ రెడ్డి, విరేష్, సత్యం, వెంకటేష్, లక్ష్మీనర్సయ్య, తదితరులు ఉన్నారు.

బాలబాలికలు అప్రమత్తంగా ఉండాలి

సఖి కేంద్రం జిల్లా అధికారి కళావతి



నార్సింగిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సఖి కేంద్రం అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా సఖి కేంద్రం అధికారి కళావతి సూచించారు. శుక్రవారం నార్సింగి జూనియర్ కళాశాల, జెడ్పీపాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. అమ్మాయిలపై అఘాయిత్యాలు జరగకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అత్యవసర సమయంలో బాలబాలికలు వెంటనే 181కు కాల్‌చేస్తే సకాలంలో రిస్క్ వాహనం ద్వారా సిబ్బంది వచ్చి రక్షణ కల్పిస్తారని తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, మానవ అక్రమ రావాణ, యాసిడ్ దాడులు, శారీరక, మానసిక ఇబ్బందులు తలెత్తినప్పుడు సఖి కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు కొత్త వారితో పరిచాయలు పెంచుకోవడం, తాత్కాలిక ఆనందాల కోసం నమ్మిమోసపోవద్దన్నారు. సెల్ ఫోన్ ద్వారా సైబర్ నేరాలతో పాటు బాలికలను మాయచేస్తున్న సంఘటనలున్నాయన్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చిన 181, 112, 1098, 1930 టోల్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సఖి కేంద్రం అధికారి మంజుల, కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్, జెడ్పీపాఠశాల హెచ్‌ఎం మురళిమోహన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



జ్యోతిర్లింగ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): శ్రావణమాసంను పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల పూజలు కొనసాగుతున్నాయి. శ్రావణమాస చివరి శుక్రవారం సందర్భంగా మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంతో పాటు జ్యోతిర్లింగ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, బిల్వార్చన, అన్నదానం కార్యక్రమాలను చేపట్టి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

చాకరిమెట్లలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన సంతోషిమాత ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఓడిబియ్యం సమర్పించారు. చాకరిమెట్ల సత్యనారాయణ స్వామి మండపంలో కొలువైన సరస్వతీమాతకు పండితులు శ్రీసూక్త అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు.

సంతోషిమాత ఆలయంలో కుంకుమార్చన

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో మహిళలు కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి

నిజాంపేట(మెదక్): పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఎస్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం గణేశ్ మండపాల నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారుల పర్మిషన్ తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవడం మేలన్నారు. పండుగను శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ వరం లాంటిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన కుమార్‌గౌడ్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం మండల కేంద్రంలో లబ్దిదారుడికి ఆయన అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు



కరణంకుంట నుంచి తరలిస్తున్న మట్టి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణానికి అక్రమంగా మట్టి తరలించారు. శుక్రవారం మండల పరిధిలోని చండూర్ గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలంలో రోడ్డు నిర్మాణానికి, కరణంకుంటలో జేసీబీ ఏర్పాటు చేసి, ట్రాక్టర్లతో అక్రమంగా మట్టి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన ఓ వ్యక్తిని ఘటన స్థలానికి పంపించగా, అతను మట్టి తవ్వకాలను ఆపేయాల్సింది పోయి, దగ్గరుండి ట్రాక్టర్లలో మట్టిని నింపి తరలించేందుకు సహాయపడడం గమనార్హం.

బోనాల ఊరేగింపు



బోనాల ఊరేగింపులో భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో కొలువైన దుర్గామాత ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు ఊరేగించి సమర్పించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగాయిపేట అధ్యక్షుడు ఆగంగౌడ్, రంగంపేట గ్రామాధ్యక్షుడు కృష్ణ, నాయకులు సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



రమేశ్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): పొలంవద్ద కిందపడి గాయపడిన రైతు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వెంకట్రావ్‌పేట గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన రైతు ఉప్పరి రమేశ్(45), అతని తమ్ముడు గౌరయ్య ఇద్దరు కలిసి ఈనెల 7న పొలంవద్దకు వెళ్లారు. ఇంటికి వచ్చే క్రమంలో కాలికి రాయి తగలడంతో కిందపడగా తలకు తీవ్రగాయం అయింది. బాధితున్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి రెఫర్ చేయగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసున మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



క్రీడలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్ రూరల్: క్రీడలు క్రమశిక్షణతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తాయని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ తారా సింగ్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, స్వామి నాయక్, పీఈటీలు ఆంజనేయులు, శ్రీకాంత్ గౌడ్, మోయిజద్దీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిస్తాం

మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): పట్టణంలోని శివారులో ఉన్న రెండు పడకల ఇళ్ల కాలనీ (కేసీఆర్ కాలనీ)లో సీసీ కెమెరాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందజేస్తానని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ హామీ ఇచ్చారు. శుక్రవారం కాలనీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. కెమెరాల ఏర్పాటుకు కాలనీవాసులు తలా కొంత డబ్బులు వేసుకుంటే తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌ఐ బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కాలనీ పట్టణానికి దూరంగా, జాతీయ రహదారి పక్కనే ఉండటంతో చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కాలనీవాసులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీలకు ఆస్కారం ఉండదని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విధులపై నిర్లక్ష్యం తగదు

కౌడిపల్లి(నర్సాపూర్): వైద్యసిబ్బంది విధులపై నిర్లక్ష్యం చేయొద్దని సీహెచ్‌ఓ ఎలిజబెత్‌రాణి తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన తిరుపల్లి మల్లారెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయన చికిత్స నిమిత్తం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రూ. రెండున్నర లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈమేరకు శుక్రవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌చారి మంజూరు పత్రాన్ని బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

◆ విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

రేగోడ్(మెదక్): విద్యుత్ షాక్‌తో తన ఎద్దు మృతి చెందినట్లు మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామానికి చెందిన బాధిత రైతు మొగిలి రాజు శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం తన పొలం వద్ద ఎద్దు మేత మేస్తుండగా, విద్యుత్ తీగ ఎద్దుపై పడడంతో మృతి చెందిందని చెప్పారు. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

◆ ఒకేషనల్ అధ్యాపకులకు శిక్షణ

రామాయంపేట(మెదక్): రామాయంపేట, మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒకేషనల్ అధ్యాపకులకు సబ్జెక్టు నైపుణ్యతపై శుక్రవారం హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. సమాజంలో పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని పలువురు అధ్యాపకులు పేర్కొన్నారు.

◆ రంగంపేటలో పౌర హక్కుల దినోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలోని ఎస్సీ కాలనీలోని కమ్యూనిటీ భవనం ఆవరణలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌ఐ మహమ్మద్ గౌస్, ఆర్‌ఐ ప్రభాకర్ హాజరయ్యారు. ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను వారు వివరించారు. కార్యక్రమంలో మాజీ వర్డ్ మెంబర్ సురేష్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు దుర్గేష్, బీజేపీ బూత్ అధ్యక్షుడు గిరి, తదితరులు పాల్గొన్నారు.

◆ కోమటిపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలి

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కోమటిపల్లి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా గుర్తించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

◆ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): బీజేపీ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త పాటు పడాలని మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు నరేందర్ చారి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రధాని పిలుపు మేరకు ప్రతీ కార్యకర్త 8800002024 నంబర్‌కు మిస్‌కాల్డ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు తదితరులున్నారు.

◆ అత్యధికంగా సభ్యత్వ నమోదు చేపట్టాలి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామస్థాయి నుంచి అత్యధికంగా బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. శుక్రవారం చండిలోని జేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్ మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మండలాధ్యక్షుడు రవి అధ్యక్షతన నిర్వహించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఆయన ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, కొండల్‌రావు, తదితరులు ఉన్నారు.

◆ వర్షాలు కురవాలని పూజలు



కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలం ఆశించని స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మండలంలో దేవాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తుక్కాపూర్ గ్రామంలో ఆ గ్రామ ప్రజలు వర్షాల కోసం హనుమాన్ మందిర్‌లోని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంజీరా నిధి నుంచి జలాలను తీసుకొచ్చి శివలింగం పూర్తిస్థాయిలో నిండే వరకు అభిషేకం నిర్వహించారు.